

# తీగచాటు రాగం

ఎ. శ్రీదేవి

అనంతమైన రాగాల్ని తనలో నిక్షిప్తం చేసుకున్న మహాయోగిలా వున్నాడతను. సాక్షాత్తూ గాన సరస్వతి ఎదురుగా నిలచినట్లు... రాగం అలవోకగా సాగి ఎద తలుపులని సున్నితంగా తాకినట్లు...

ఈ మధుర సంగీతంలో యింత విషాదం ఎక్కడిది? అద్భుతమైన రసానందాన్ని వెలువరుస్తూనే అలవోకగా విషాదపు లోయలోకి దిగిపోయే భావన ఎటునుంచి వస్తోంది? ఎలా గుండెని చుట్టుకుపోతోంది? ప్రియ ఆలోచనలు గుండె పొరల్ని గాలి తెరలు కదిలిస్తున్నట్లుగా సాగుతున్నాయి.

అర్ధనిమీలిత నేత్రాలు... సితార పై అలవోకగా కదులుతున్న వేళ్లు... ముగ్ధురాలై పోతోందామె.

ఆమె చేతిలోని సితార మూగవోయింది. ఆమె అణువణువులో అతని రూపమే నిండిపోయివుంది— అలలు అలలుగా వంపులు తిరిగిన జుట్టు— విజ్ఞానాన్ని సూచించే విశాల ఫాల భాగం... ఎత్తయిన ముక్కు— హిమగిరిలా... ఎర్రని పెదవులు... అందమైన చుబుకం... ఆమెకీ ఎప్పుడూ కొత్తగా వింతగా ఆనందంగా అద్భుతంగా అనిపిస్తుంది.

అపూర్వమైన జీవనగానం వింటున్నట్లుగా ఆనందపు అలలు గుండెని తాకినట్లు...

వరరుచి కనులు తెరచి ఆమెవంక చూశాడు,... కదలిక లేని వేళ్ళని మౌనంగా ప్రశ్నించాయతని కనులు.

"మాస్టారూ... యీవేళ..."

అర్ధోక్తిలో ఆగిపోయిన ఆమె

స్వరాన్ని అందుకున్నట్లుగా... "బాగా లేదు" అన్నాడు భావగర్భితంగా.

అవునన్నట్లుగా దిగులుగా చూసి .. కనులు వాల్చేసింది—

'అంతా బాగానే వుంది. అమ్మాయి కాస్త నలుపు...' పెళ్ళికొడుకు తల్లి ముఖానే అనేసింది. ఆ మాట ఎన్నో సార్లు విన్న రాగప్రియ... మరీమరీ విరగబడి నవ్వుకుంది.

తల్లి కూతురి ప్రవర్తనకి కోపం, చిరాకు మేళవించిన చూపొకటి విసిరింది. "సిగ్గులేకపోతే సరి, ప్రతి సంబంధమూ యిలా తప్పిపోతున్నదని... నేను కుమిలి ఛస్తున్నాను నీకు నవ్వులాటగా వుందా?" ఖస్సుమందామె...

"ఏం చెయ్యమంటావమ్మా! నల్లగా వుండటమే నే చేసిన మహాపరాధమా?" ప్రియ కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

"ఏం లోకంలో అందరూ తెల్లగా వుండాలని రూలుందా? ఆ కృష్ణుడు నలుపు కాదూ? లోకానికి ఆరాధ్య దైవం కాలేదూ? ఆ మోహన సౌందర్యం పై ఎన్ని కావ్యాలు వెలువడలేదు?"

"ప్రియా! నేను నిస్సహాయుణ్ణి. అమ్మ యీసారి ఎర్రటి కోడలు కావాలంటోంది నన్ను క్షమించు ప్రియా!" మేనమామ కొడుకు రాజారావు నిస్సహాయంగా అంటున్నపుడు ప్రియ పెదవులపై మందహాసమే మెరిసింది.

"పోన్లే బావా! నువు మాత్రం ఏం చేస్తావ్!" అంటూ అనునయించింది బరువెక్కిన హృదయంతో.

"సారీ ప్రియా! నీ అందం ముందు యీ ఎర్రటి బొమ్మలు ఎందుకూ పనికిరావు. నండూరివారి ఎంకిలా, విశ్వనాథ వారి కిన్నెరసానిలా వుంటావు."

"థాంక్స్! బావా!" ఫక్కున నవ్వేసింది ప్రియ.

అదంతా గుర్తుకొచ్చి పకపకా నవ్వేసిందామె. వరరుచి చేతిలోని సితార పక్కకి పెట్టేసి ఆమెవంక పరిశీలనగా చూశాడు.

"ఇవాళ్టికి పాఠం అయిపోయినట్లే."

గంభీరంగా ఆయనన్న తీరుకి మరింత నవ్వు ముంచుకొచ్చిందామెకి.

"ప్రియా! నువ్వివాళ మరీ మూడీగా వున్నావు. ఏంటానవ్వు? పెళ్ళి కావలసిన పిల్లవి ఎంత హుందాగా వుండాలి?"

"ఎందుకు మాష్టారూ! గంభీరంగా విషాదంగా ఏదో పోగొట్టుకున్నట్లు... అహ... ఆ పోగొట్టుకున్నదేదో జీవితంలో పొందలేమనుకోండి." ఆ గొంతులోని ఆనందం విషాదాన్ని కప్పిపుచ్చే ముసుగు మాత్రమే...

వరరుచి బాధగా చూశాడు... ప్రియ సితార వదిలేసి లేచివెళ్ళి కిటికీ దగ్గర నిలుచుంది.

"ప్రియా! మళ్ళీ పెళ్ళిచూపులు జరిగాయా?"

అది మామూలేగా అన్నట్లు చూసింది

"మాస్టారూ! మీకో విషయం తెలుసా? నా పెళ్ళిచూపులు శతదినోత్సవం చేసుకున్నాయి," వెనక్కి వంగి విరగబడి నవ్వింది.

ఆ నవ్వు అతని గుండెని నలిపేస్తుంది. "అలా నవ్వవద్దన్నానా?"

"ఏం మాస్టారూ నా నవ్వు బావుండదా?"

"బావుంటుంది. చాలా బావుంటుంది. ఆ హాసమాధుర్యాన్ని భరించలేను. నీ నవ్వులోనే పోగొట్టుకున్నదేదో పొందినంత తృప్తి. ఆ రంపపుకోత నీకు తెలీదు ప్రియా!" అతని హృదయం మూగగా ఏడ్చింది.

"మాస్టారూ!" ఏదో అడగాలని ఆశగా చూసింది.

"అబ్బబ్బ వంటింట్లో నేనొక్కదాన్ని ఛస్తున్నాను. మీకు పెళ్లాంమీద శ్రద్ధలేదు. ప్రేమలేదు. ఆ సితార నా సవతి. దాన్ని విరిచి పొయిలో పెడితేగాని నాకు మనశ్శాంతి రాదు." లోపల మంగతాయారు గట్టిగా అరుస్తోంది.

"మాస్టారూ! ఏమిటి విశేషం?" ఆమె కనులు మూగగా ప్రశ్నించాయి

"ఈరోజు నా బర్త్ డే. ఏవేవో చేయాలని ఆరాటం... చేయలేని అశక్తత... అదీ... యిదీ కూడి... నా మీద విరుచుకుపడుతుంది" పేలవంగా నవ్వుతూ అన్నాడు.

ఆమె కళ్ళు వింతకాంతితో మెరిశాయి. ఆరాధనగా అతనివంక చూసింది. అతనికి దగ్గరగా వచ్చి... ఆ తలని అపరూపంగా చేతుల్లోకి తీసుకుని... చెంపలు ఆప్యాయంగా సవరించి పెదవులమీద గాఢంగా ముద్రలు వేసింది.

అతను తెల్లబోయాడు. పులకించిన హిమగిరి శిఖరంగా... అనురాగ జలపాతం గలగలా ప్రవహించినట్లు. అనిర్వచనీయమైన అనుభూతి...

ఆమె ఒక్క క్షణంకూడా అక్కడ నిలవలేదు. వంటింటికేసి పరుగుదీసింది.

వంటింట్లో రణరంగంలా వుంది. గరిట పట్టుకున్న మంగతాయారు యుద్ధసైనికుడిలా నానా హైరానా పడిపోతోంది...

ప్రియను చూడగానే మంగతాయారు ముఖం ఆనందంతో వికసించింది. "రా ప్రియా పొద్దుటినుంచి చాకిరితో సతమతమౌతున్నానా ఒక్కరికీ చీమ కుట్టినట్లు లేదు." బాధగా కళ్ళు తుడుచుకుంది.

పైటచెంగు నడుం చుట్టూ దోపి చకచకా అన్ని పనులు అందుకుంది ప్రియ. టమాటాలు పచ్చడి నూరేసింది... చిత్రాన్నం తయారు చేసింది. బజ్జీలు వేయిస్తూ... కూర తరుగుతోంది...

ఆమె పనిచేసే తీరుకి మంగతాయారు ముగ్ధురాలై పోయింది.

"నిన్నెవరు చేసుకుంటారోగాని అదృష్టవంతులే ప్రియా! మా పిల్లలూ

వున్నారు దేనికీ కొఱగారు" అంది విశ్రాంతిగా పీట వాల్చుకూర్చుంటూ.

"మీరు... చెప్పి చేయించండి. ఎందుకు చేయరు."

"అంతా నా ఖర్మ! తండ్రి తండ్రీ కూతుళ్ళు కూతుళ్ళే—"

చేతిలో నవల పట్టుకుని పదహారేళ్ళ స్వప్న ఆ రూములోకొచ్చింది. "హాయ్! అక్కా! నువ్వెప్పుడొచ్చావ్? నువ్వొచ్చావంటే వంటిల్లు ఘుమఘుమ లాడిపోవాల్సిందే... నాన్నగారి బర్త్ డే స్పెషల్స్ ఏవిటో?" సంతోషంగా అడిగింది.

అమ్మాయితో కబుర్లు చెబుతోంది. నవ్వుతూ హుషారుగా యీలవేసుకుంటూ వచ్చాడు భర్త శ్రీహరి బి.ఏ. బి.యిడి చేసి వూరికే వున్నాడు.

'ఆహా...ప్రియ వంటకాలు మధురం సుమధురం మా యిల్లు నీ అడుగులతో పావనం... మా హృదయాలు నీ రాకతో నందనం... ఏదీ... అయినంతవరకూ వడ్డించేయ్" హడావిడిగా పీట వాల్చుకుని కూర్చున్నాడు.

"ఒక్క నిముషం ఆగు హరీ! నాన గారి బర్త్ డే కదా... అందరూ కలిసి సరదాగా భోంచేయండి.

బుద్ధిగా ఒప్పేసుకున్నాడు...

"ప్రియా! నీరాకతో నాకు మనశ్శాంతి. ఈ పిల్లలు నీ మాటలకి లొంగిపోతారు— నా గుండె పొంగిపోతుంది. ఆ వాక చక్యం ఆమెకు లేదు. యీ జీవితానికి పరిపూర్ణత లేదు!..."సితార తీగలు సరి చేస్తూ బాధగా అనుకున్నాడు.

• • •

"ఎన్నాళ్ళిలా నన్ను వేధించి చంపుతావే, ఎవరు నిన్ను వలచి వరించారు. నిన్ను మెచ్చినవాళ్ళను నీవు మెచ్చవు" అన్నపూర్ణమ్మ అరుపులకి ప్రియ హడలిపోలేదు.

"ఈ జీవితంతో నే రాజీపడలేనమ్మా."


"రాజీ పడలేకపోతే- ఆ బావిలో పడి చావు. పీడా వదిలిపోతుంది." ఆ మాతృహృదయం ఎంతగా క్షోభించక పోతే యీ మాటలంటుంది. ఆమె కళ్ళల్లో గంగా యమునలు పొంగాయి.

ప్రియ దగ్గరగావచ్చి తల్లి కళ్ళ నీళ్ళు తుడిచింది.

"ఎందుకమ్మా బాధపడతావ్. పెళ్ళితోనే సమస్య తీరిపోతుందా? అప్పుడే మొదలౌతుంది అసలు క్షోభ."

"ఏవిటే నీ గోల? ఎవడినో ఒకడిని కట్టుకోక ఏం చేద్దామని?"

"ఇలాగే వుండిపోతాను. ముక్కూ ముఖం తెలీనివాడిని కట్టుకుంటాను. వాడికి నా మనసేవిటో అర్థంకాదు. నలుపు, నలుపని జీవితాంతం సాధిస్తాడు. పెట్టుపోతలు బాగా జరగలేదని హింసిస్తాడు. అ నరకం నే భరించలేనమ్మా..."




"పోనీ... నీ నలువుని యిష్టపడే ఆ రంగనాయకులుగారిని చేసుకో. లక్షలాస్థి. నీవంటే మోజుపడుతున్నాడు" రాజీగా మాట్లాడిందామె.

విషాదంగా నవ్వింది ప్రియ. "ఎందుకమ్మా ఆత్మవంచన? ఆయనకి నా యీడు కొడుకులున్నాడు. ఆ కొడుకు ఒకసారి నాకు ప్రేమలేఖ వ్రాశాడు. వాడు పెళ్ళి చేసుకోడు. నన్ను ప్రేమిస్తాడు. అంతే—" ఆమె గుండె నిప్పుల కవ్వంతో చిలికినట్లయింది.

అన్నపూర్ణమ్మకి విసుగేసింది. "అన్నిటికీ అన్ని సమాధానాలు చెబుతావు" కోపంగా లోపలి కెళ్ళిపోయింది.

"ప్రియా! నీవంటే నాకెంత అభిమానం. నిర్భయంగా నిస్సంకోచంగా వుండే నీ మనస్తత్వం నాకు ముచ్చటేస్తుంది. నిరాశతో కృంగిపోదు. జీవితమంతా అంధకారబంధురం కాదు. ఏదో ఒక ఆశాకిరణం గుండెని వెలిగిస్తుంది." వరరుచి మాటలు ఆమెలో వూపిరి పోశాయి. పోతుందనుకున్న ప్రాణాన్ని పట్టి నిలిపాయి.

ఆయనకి ప్రాణమైన సితార్‌ని తను చేతుల్లోకి తీసుకుంది. నిరాశ దూర దూర తీరాలకు పారిపోయింది. కానీ... ఏం మిగిలింది? ఏం మిగులుతుంది? జీవితం శూన్యపాత్రలా వుంది.

"పోనీ... మాష్టారూ! నన్ను పెళ్ళి చేసుకోరాదూ?

ఆమె అనాలోచితంగా అడిగిందనుకున్నాడు. అతని కళ్ళు క్షణకాలం

మెరిసిపోయాయి. ఒక మధుర భావన గుండెలో వెలిగించిన ప్రేమదీపం- ఆ ఒక్క-క్షణం చాలు- బ్రతుకులో అదే దివ్య వరం—

మరుక్షణం తనని తాను నిగ్రహించుకున్నాడు. రూపు దాల్చబోతున్న స్వప్నాన్ని చెదరగొట్టేశాడు. ఆకృతి దాల్చబోతున్న అనుభూతిని అదిమి పట్టేశాడు.

"ప్రియా! ఏం మాటలవి?" సున్నితంగా మందలించాడు.

"ప్రియా! ప్రియా! అని వందసార్లనండి. మీ పాదాల దగ్గర తలవంచుకుని చచ్చిపోతాను. ఆ ఆత్మార్పణలో కరగిపోతాను." ఆ గొంతులో వుద్వేగం- అనురాగం ఆప్యాయత- ఆర్ద్రతతో పొంగుతున్న గుండెలో నిఆవేదన.

"నీ క్కాలంటే అలాగే పిలుస్తాను. ఈ జీవితమంతా నీ నామం జపిస్తాను నీ కోసం తపిస్తాను. మరో జన్మంటూ వుంటే నీలాంటి స్త్రీమూర్తి కావాలని తపస్సు చేస్తాను." అనాలనుకున్నాడు. చిరునవ్వులో ఆ భావాన్ని పొదిగాడు. ఆమె గుండెలో అపురూపంగా ఒదిగిపోయాడు.

"నిన్ను నలుపు అన్నవాళ్ళు మూర్ఖులు. నీ గుండెలో ఎంత అమృతముందో ఆ మూర్ఖులకేం తెలుసు" అంటాడతను.

"మాస్టారూ! మీ జుట్టు ఎంత అందంగా వుంటుందని. మీరు నవ్వనంటే... ఒక మాట చెబుతాను. మీకు తలకక పోయాలనిపిస్తుంది. మేఘమాలిక లాంటి ఆ జుట్టుతో తనివిదీరా ఆడుకోవాలనిపిస్తుంది... ఆమె గొంతులో వలపు గంగాతరంగాలు వువ్వెత్తుగా ఎగిసిపడుతున్నాయి. కన్నులు అరమోడ్పులై రాగరసాన్ని గుమ్మరిస్తున్నాయి.

తొలిసారిగా గుండె స్పందించి చలించిపోయాడు.

"ప్రియా నీ కెందు కింత ప్రేమ?"

"ఏమో మాస్టారూ? నాకు మేఘసందేశం చదువుతుంటే ఏమనిపిస్తుందో తెలుసా? యక్షుడు కబురంపిన మేఘమాలిక మీ జుట్టులా అనిపిస్తుంది. బహుశా ఆ యక్షిణి నేనే అయి వుంటాను." చివరి మాటలు సిగ్గుపిగ్గుగా గొణుగుతున్నట్లుగా అంది.

ఆ మాటలు మంత్రాల్లా అనిపించాయతనికి.

"నీ మాటలు మంత్రమ్ములు
నీ మది దేవాలయమ్మ
నీ నగవేమో అమని పూచిన వెన్నెల
నా మెయి పులకింత వింత
నన్నేలు సఖీ"

అతని మనసులో మెరపుల్లా మెరిశాయి పంక్తులు.



"ప్రియా! నీ మనసునుండి ఆ భావన తుడిచివెయ్. అస్తమిస్తున్న సూర్య బింబాన్ని నేను. నీవో వుదయిస్తున్న లేలేత చంద్రకాంతివి. కొన్ని యధార్ధాలు ముల్లులా గుచ్చుకుంటాయి. నిరాశకు లోనైన నీ మనసు నా వైపుకి మళ్ళిందంతే. ఇది ప్రేమ కాదు." ఆ మాటలు అనటానికి అతనికి ప్రాణాలు పోతున్నట్లే అనిపించింది.

ప్రియకు కన్నీళ్ళు వుబికి వచ్చాయి. ఎక్కడుంటాయి యీ కన్నీళ్ళు. సమయం చూచుకుని నయన మందిరం నుండి నయాగరా జలపాతాల్లా వురుకుతాయి. ఎదుటి మనిషికి యిట్టే దొరికి పోతాయి.

"మాస్టారూ. అలా అనకండి. ఇది ప్రేమ కాకపోతే యీ అనురాగానికి అర్ధం లేకపోతే.. ప్రేమ అన్న పదానికే అర్ధమూ... పరమార్ధమూ లేదు. నాకు పెళ్ళికాదని దిగుల్లేదు..."

"నీ అన్నలు స్వార్ధం చూసుకుని వెళ్ళిపోయారు. ఆ మానవుడు యీ బాధలు చూడకుండా తనదారి తను చూసుకున్నాడు. నీవేమో కొరకరాని కొయ్యవై పోయావు." అన్నపూర్ణమ్మ సణుగుతూనే వుంది...

"ఇదిగో! మహారాణీ- పట్టపగలే కలలు కంటున్నావు. మీ బావ వచ్చాడు చూడు."

తల్లి మాటలకి త్రుళ్ళిపడింది. స్మృతి తరంగాలలో తేలిపోతున్న ఆమెలో చలనం వచ్చింది. ఎక్కడో చిక్కుకున్న చూపులు చెదిరి మళ్ళి కేంద్రీకరించుకుని ఎదురుగా నిల్చున్న బావ వైపు చూశాయి.

* * *

"ఈ చల్లని రేయి తిరిగి రానే రాదు-
నీ చక్కని మోము చూడ తనివి
తీరదూ..."

గాలి అలలతో తీయగా వూసులాడుతూ పూల తెరలలో పులకరిస్తూ స్మృతి పరిమళాల తరగలని మోసుకొస్తూ... నీహార చంద్రికల తళతళల సోయగాలు విరజిమ్ముతూ... గుండెపొరల్ని మధురంగా పలికిస్తూ... ఆ పాట సాగిపోతోంది.

అది బాలసరస్వతి కంఠం కాదు. రాగప్రియ స్వరమాధురి... వరరుచి కా పాట ప్రాణం. త్రికాల సంధ్యావందనం లాగా ఆ పాటవింటూ తన్మయుడౌతాడు.

"మాస్టారూ! మిమ్మల్నొకరినీ విడిచి అందరూ సినిమా కెళ్ళిపోయారా?" ప్రియ కంఠంలో ఆతృత, ఆవేదన—

"రా ప్రియా! నాకీ సినిమాలు యింట్రస్టు లేదు..." నవ్వుతూ ఆహ్వానించారు. ఆయన రెండువేళ్ళకి కట్టుకట్టి వుండటం చూసిందామె...

"ఏవిటిది మాస్టారూ?"

సన్నగా నవ్వాడతను...

"ఏదో ఆలోచిస్తూ... సితార తీగలు గట్టిగా లాగేశాను. అవి నా రక్తాన్ని ఆప్యాయంగా చవిచూశాయి." తేలిగ్గా నవ్వుతూ చెప్పాడు.

ప్రియ బాధగా చూసింది..."మాస్టారూ మీకు అన్నం కలిపి పెడతాను." అంటూ చనువుగా వంటింట్లో కెళ్ళింది. కూరలేమీలేవు, మళ్ళీ రెండు కూరలు చేసింది.

ఆప్యాయంగా ముద్దలు కలిపి తినిపించింది.

"ఇలా నేను కడుపునిండా అన్నం తిని ఇరవై ఏళ్ళు పైగా అయింది.

"అదేం?" ఆశ్చర్యంగా చూసింది.

"పెళ్ళికాకముందు అమ్మ పెట్టేది- పెళ్ళయ్యాక మంగతాయారు ధాటికి భయపడి ఆమె రావటం మానేసింది."

ప్రియ వుస్సురని నిట్టూర్చింది...

వెన్నెల అప్సరసల హాసంలా వుంది. పొన్నపూలు రాలిపడుతూ గుండెలో గుబులు సృష్టిస్తున్నాయి. నైట్‌క్వీన్ కలలరాణిని నేనే అన్నట్లు పరిమళాలు పంచిపెడుతోంది.

"ప్రియా! పొద్దుపోయింది. ఇంటి దగ్గర విడిచివస్తాను పద." అతనిలో కంగారు చూసి నవ్వొచ్చిందామెకి.

"మాస్టారూ! పాట పాడనా?"

"ప్రియా! పొద్దుపోయింది."

మరల ప్రియా అంటుంటే యీ రాత్రికిక కదలబుద్ధి కాదు. ఆమె గుండెబరువు మాటల్లో...

"ప్రియా! నీకు లోకం సంగతి తెలీదు."

"తెలుసు. నలభై ఏళ్ళ మీకు యిరవయ్యేళ్ళ నాకూ సంబంధం అంటగడుతుందా? పోనీ... అలా జరిగినా అదృ

ష్టమే." ఆమె కళ్ళల్లో నీళ్ళు. గుండెలో గుబుళ్ళు.

"ప్లీజ్! అలా మాట్లాడకు ప్రియా!"

ప్రియ లేచింది. అతనికి దగ్గరగా వచ్చింది. ఆమె రెండుచేతులూ ముందుకి సాగి అతని తలని గాఢంగా హృదయానికి హత్తుకున్నాయి. ఆ జుట్టులో మోము దాచుకుని గాఢంగా... గుండె నిండిపోయేలా...ఆ మధుర పరిమళాన్ని ఆఘ్రాణించింది.

గతజన్మల సంస్కార పరిమళాలేవో ఆమెని వుక్కిరిబిక్కిరి చేశాయి. ఆనందాశ్రువులు జారి అతని జుట్టుని తడిపేస్తున్నాయి

"ఇది అనురాగాభిషేకమా? ప్రేమాభిషేకమా? పిచ్చిపిల్లా" వేదాంతిలా నవ్వాడతను.

శిలలా కూర్చుండిపోయాడతను. ఎదలో ఏదో అలజడి. నిండా పాతికేళ్ళ వసంతం వచ్చేసినట్లనిపించింది.

"మధురమైన వసంతగానంలా కప్పేశావు చెలి! ఏ ఋతువుకుందీ ప్రభావం?..."

ప్రియ డైనింగ్ టేబిల్ మీద చేయి వేసి చెంప ఆనించుకుని అతనివంకే చూడసాగింది...

సన్నని గొంతుతో తీయగా పాడసాగింది మనసు మధుమాసమైనవేళ గొంతులో కిన్నెరలు కాపురముంటారు... కళ్ళు వెన్నెలపూలు కురుస్తాయి.

"ఈ చల్లనిరేయి తిరిగి రానేరాదు. నీ చక్కని మోము చూడ తనివి తీరదు."

పాట పూర్తయేసరికి ఆమె కళ్ళు నీళ్ళు నిండిన తటాకాలయ్యాయి. చెంపలు ఎర్రబడ్డాయి.

అతను మృదువుగా ఆమె చెంపలు తుడిచి ముంగురులు సవరించాడు.

ప్రియ అతన్ని మాధవీలతలా పెనవేసుకుపోయింది. ఏనాడూ, ఎక్కడా దొరకని ఆత్మీయతా... ఆప్యాయతా అతని సన్నిధిలో లభించాయి.

"మాస్టారూ! నాకు చచ్చిపోవాలని వుంది." ఆమె భోరుమని యేడ్చేసింది. ఆయన కంగారుపడ్డాడు. ఆ పిల్లని ఓదార్చి మామూలుస్థితికి తెచ్చేసరికి ఆయనకి ముచ్చెమటలు పోశాయి... అతనిని వదలలేక వదిలింది...

కన్నీటితో అతని గుండెలో పెనుతుఫాను సృష్టించింది... అలవికాని మమతల అలివేణిలా... కలల కల్యాణిలా... స్వప్నసుందరిలా వూహామూర్తిగా... మురిపించింది— అలరించింది... మమతల పాలవెల్లిగా పొంగిపోయింది.

ఆ పాట అతని గుండెలో ఆ తరవాత టేప్‌రికార్డర్‌లోకి రికార్డయిపోయింది. ఆ పాట మరెవ్వరు పాడినా సహించలేదు.

పాట పూర్తయినా అతనింకా ఆ రసప్రవాహం నుండి తేరుకోలేదు. స్వప్న వచ్చి రికార్డ్ ఆపేసింది.

• • •

ఆరోజు ప్రియకోసం ఎంతగానో ఎదురుచూచాడు వరరుచి. సౌందర్య స్వప్న సాక్షాత్కరించి... ప్రేమాంజలి ఘటించినట్లు ఎంత తీయని అనుభూతి ప్రియ... ఎంత తీయని విరహవీణ... యీ జాణ... అతని మనసు ఏదోలా... తనకే తెలియని అగాధాలు... వింత వింత భావాలు ..

పోస్టులో లెటరొచ్చింది. ఆత్రంగా విప్పి చూశాడు.

"ప్రియమైన మాస్టారూ!

కొన్ని జీవితాలు శాపాలని వెంట తెచ్చుకు పుడతాయి. నలుపుని శాపంగా తెచ్చుకుని అవతరించాను నేను. అభిమానం, ఆప్యాయత నాకు తెలియవు. జీవన సమరంలో అమ్మ వాటిని గురించే మర్చిపోయింది.

నా అనుకున్నవాళ్ళు నా రంగుచూసి భయపడి పారిపోయారు. ఒక్క మీరు మాత్రం నా జీవితంలోకి నవ వసంతంలా ప్రవేశించారు. జీవితంలో ఏ నాడూ వాసంత సమరం ఎరుగను.

మీ చల్లని చూపులో నాకది లభించింది. కాని, మాస్టారూ టూ లేట్. నేను ఎక్కవలసిన బండి జీవితకాలం లేటయిపోయింది.

మరో ట్రెయిన్ ఎక్కి ఎడ్జస్టయే ఓపిక లేదు. నన్ను ఇరవై ఏళ్ళక్రితం పుట్టించివుంటే ఎంత బావుండేది? తీరని కోరికలతో ఎంతకాలమీ బ్రతుకు. వెళ్ళిపోతున్నాను. ఎక్కడికనుకుంటున్నారు? మీ కళ్ళల్లో మీ గుండెలో కలకాలం నిలిచిపోతాను,

పెళ్ళిచేసుకుని అమ్మ కోరిక తీర్చలేను. అందుకే నర్స్ ట్రెయినింగ్‌కి వెళుతున్నాను. ఈ స్మృతుల సితారను మరచిపోకండి. మీరు కలలుకన్న జీవితం మీకు దొరకదు. నే నాశించినది నాకు దొరకదు. అందుకే దూరంగా... మీ గుండెకి దగ్గరగా,

మీ

ప్రియ"

వరరుచి గుండె బాధతో వణికింది. కళ్ళల్లో గంగా యమునలు... "ఈ చల్లని రేయి తిరిగి రానేరాదు. నీ చక్కని మోము చూడ తనివి తీరదు..." దూరంగా రేడియోలోనుంచి బాలసరస్వతి గొంతు వలపు సితారని సుతారంగా మీటుతోంది.